క్లుప్తంగా

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసిన తర్వాతనే ఉద్యోగ నియామకాల ప్రకటనలు వెలువరించాలని భారతీయ ఛత్రపతి పూలే జాగృతి అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం 27నుంచి 42శాతానికి రిజర్వేషన్ పెంచిన తర్వాత ఉద్యోగ ప్రకటనలు జారీ చేయాలన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిల్ల శ్రీధర్‌బాబు తీసుకెళ్తామని తెలిపారు. వర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్‌లను వెంటనే నియమించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు విగ్నేష్ డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో హెల్త్ సెంటర్‌ను సోమవారం వారు సందర్శించారు. విగ్నేష్ మాట్లాడుతూ.. హెల్త్ సెంటర్‌లో సిబ్బంది, మందులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు పవన్, సతీష్, సాగర్, దినేష్, చిత్రు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను నిలిపివేయాలి

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ రజక సంఘ భవన నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని జీపీ కార్యదర్శి నరేష్ స్పష్టం చేశారు. గ్రామంలోని జీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 913 సర్వే నెంబర్‌లో ఆదర్శ రజక సంఘ భవనం నిర్మించుటకు అవసరమైన పత్రాలు సరిగా లేవని, నిర్మాణానికి అనుమతులు ఇవ్వలేమని తెలిపారు. పనులు ఆపకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్‌స్థలాన్ని కబ్జా చేసి, నిర్మాణం చేపట్టిన రఘువీర్‌భూపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎల్లమ్మగుట్టకు చెందిన అందే నారాయణ కోరారు. ఈమేరకు సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్ మంద మకరందుకు విన్నవించారు. రఘువీర్ భూపాల్ తమ్ముడు రణ్‌వీర్ భూపాల్ మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తూ అక్రమ నిర్మాణాన్ని కాపాడుతున్నాడన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

నగరంలో ఫ్లెక్సీల వివాదం

- నగరంలో మున్సిపల్ ఉద్యోగ సంఘం పేరుతో ఏర్పాటు
- వారం రోజులైనా తొలగించని కార్పొరేషన్ అధికారులు



నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఉద్యోగుల ఫ్లెక్సీ

నిజామాబాద్‌నాగారం: న్యూ ఇయర్, సంక్రాంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో నగరంలో ఇటీవల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కానీ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం పేరుతో నగరంలోని వివిధ వ్యాపార సంస్థల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లు చేసి సుమారు 80కిపైగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. వారం రోజులుగా ఫ్లెక్సీలు నగరంలోని మున్సిపల్‌కార్యాలయం ఎదుట, ప్రధాన చౌరస్తాలు, రోడ్డు మీద ఎక్కడ పడితే అక్కడ అలాగే ఉంచారు. దీంతో మున్సిపల్ సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.లక్షకు పైగా ఖర్చు..

మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ కార్పొరేషన్ భవనాల ట్యాక్స్ వసూలు చేసే ఒక ఉద్యోగి, కొంత మంది సిబ్బంది ఉద్యోగుల సంఘం పేరుతో నగరంలో ఇటీవల ఫ్లెక్సీలు పెట్టారు. ఒక ఫ్లెక్సీ రూ. 1200 నుంచి రూ. 1500వరకు ఉంటుంది. ఈ లెక్కనా సుమారు రూ. 1లక్షపైనే ఖర్చు అయింది. అయితే ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో టిఫిన్ సెంటర్లు, హోటల్స్, షాపింగ్ మాల్స్‌లతో శుభాకాంక్షలు తెలిపినట్లు ఏర్పాటు చేయించడం విడ్డూరంగా మారింది. ఒక్కో దుకాణం నుంచి వేలల్లో వసులు చేసి, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి జేబులు కూడా నింపుకున్నారని చర్చించుకుంటున్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి కూడా నగరంలో ఇన్ని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు దాఖలాలు లేవు.

పట్టించుకోని అధికారులు

ఉద్యోగ సంఘాలు ఫ్లెక్సీలు పెట్టడం తప్పు కాదు. కానీ నగరంలో ఎక్కడ పెడితే అక్కడ పెట్టారు. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్ ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఉన్నతాధికారులు చూస్తూ కూడా స్పందించకపోవడం గమనార్హం. ఈ ఫ్లెక్సీల ఏర్పాటుపై విచారణ జరిపి వివిధ వ్యాపార సంస్థల నుంచి వసూలు చేసిన సొమ్మును రికవరీ చేసి మున్సిపల్ కార్పొరేషన్ ఖాతాలో జమ చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బీఎల్ఎఫ్), ప్రజా సంఘాలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విచారణ జరపాలి

ఖలీల్‌వాడి: అక్రమ వసూళ్లతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై విచారణ జరపాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్‌పీ) రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దండి వెంకట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్లెక్సీలను ఎందుకు తొలగించడంలేదని ప్రశ్నించారు. ఫ్లెక్సీల ఏర్పాటుపై విచారణ జరిపి వివిధ వ్యాపార సంస్థల నుంచి వసూలు చేసిన సొమ్మును రికవరీ చేసి, మున్సిపల్ కార్పొరేషన్‌కు జమ చేయాలని కోరారు.

తొలగించాలని ఆదేశించాం..

నూతన సంవత్సరం సందర్భంగా నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు తెలుసు. రెండు రోజుల క్రితమే కార్యాలయం ఎదుట ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని చెప్పాం. నగరంలో వందల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విషయం నాకు తెలియదు. అక్రమ వసూళ్లు చేస్తే శాఖపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తాను.

–దండు నీతూకిరణ్, మేయర్, నిజామాబాద్ కార్పొరేషన్



చెరువంతా నాచే

నిజామాబాద్ రూరల్: పై చిత్రంలో కనిపిస్తున్నది పచ్చని పైరు అనుకుంటే పొరబడినట్లే!. మండలంలోని మాధవనగర్ చెరువులో నాచు పేరుకుపోయి, ఇలా చెరువంతా పచ్చని పైరులా కనిపిస్తోంది. ఈ చెరువు చూపరులకు, వాహనదారులకు ఆహ్లాదరకమైన వాతావరణాన్ని కల్పిస్తోంది. అలాగే ప్రమాదం పొంచి ఉంది. దీంతో చెరువులో ఏర్పడ్డ నాచును తొలగించాలని గ్రామస్తులు ఇప్పటికే అధికారులకు విన్నవించినట్లు తెలిసింది.

ఆధార్ సెంటర్లను పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

ఖలీల్‌వాడి: జిల్లాలో ఆధార్ సెంటర్ల సంఖ్యను పెంచాలని, మీసేవ కేంద్రాలకు ఆధార్ అప్డేట్ అవకాశం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఆధార్ సెంటర్‌లు తక్కువగా ఉండడం వల్ల ప్రజలు సకాలంలో కార్డులు పొందలేక పోతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఆధార్ సెంటర్లను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయించాలన్నారు. నాయకులు ఓమయ్య, రాజేశ్వర్, రంజిత్, గంగారం, రామ్‌దాస్, రఘురాం పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: దేశంలోని అర్హులైన ప్రతిఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా చూడటమే 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' ముఖ్య ఉద్దేశమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద సోమవారం ఆయన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా క్యాలెండర్, బ్రోచర్లను ఆవిష్కరించారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం బస్వా లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ప్రజలే అంబాసిడర్లు అని తెలిపారు. 2047 నాటికి భారతదేశం అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలని ప్రధాని నరేంద్రమోదీ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల ప్రజలతోపాటు ప్రతిఒక్కరికి వందశాతం కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. బీజేపీ నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు పారితోషికం, జ్ఞాపికను అందజేస్తున్న మంగి రాములు మహారాజ్, మంచాల జ్ఞానేందర్

సుభాష్‌నగర్: నందిపేట మండలంలోని పలుగుట్టలో ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ప్రచార పరిషత్, జిల్లా ధర్మజాగరణ సమన్వయ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం మంచాల శంకరయ్యగుప్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్, మంగిరాములు మహారాజ్ బహుమతులు (పారితోషికం) అందజేశారు. అనంతరం మంగి రాములు మహారాజ్‌కు మంచాల జ్ఞానేందర్ భగవద్గీతను అందజేశారు. 150 భగవద్గీతలను భక్తులకు పంపిణీ చేశారు.

నేడు యువతకు వ్యాసరచన పోటీలు

నిజామాబాద్ సిటీ: స్వామి వివేకానంద జయంతి (జాతీయ యువజన దినోత్సవం) సందర్భంగా నగరంలో నేడు రామకృష్ణ సేవా సమితి, జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో యువతీయువకులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు రామకృష్ణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సాయిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని గంగాస్థాన్ 2లో రామకృష్ణ ధ్యాన మందిరం, వివేకానంద ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు వ్యాసరచన పోటీలు, 12న వ్యాసరచన, ఉపన్యాస పోటీలు తెలుగు, ఇంగ్లీష్ భాషలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు, వివేకానంద సాహిత్య బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువతీయువకులు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ మృతిపై సంతాపం



సుభాష్‌నగర్: కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శివశంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో సోమవారం ఆయన మృతి పట్ల నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా అధికార యంత్రాంగం సంతాపం వ్యక్తం చేసింది. శివశంకర్ చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధ, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, కార్మిక శాఖ అధికారి యోహాన్ పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. శివశంకర్ సేవలను కొనియాడారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని నర్సాగౌడ్‌వీధి పద్మశాలి తర్ప–14 నూతన కార్యవర్గంను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి వెంకటేశం, జనరల్ సెక్రెటరీగా గుండ నాగరాజు, కోశాధికారిగా దాసరి వివేకానంద్, ఉపాధ్యక్షుడిగా కొక్కుల భాస్కర్, జాయింట్ సెక్రెటరీగా శెర్‌పల్లి బాబురావు ఎన్నికయ్యారు.

ఆధ్యాత్మికం

అయోధ్య అక్షింతల పంపిణీ



డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో సోమవారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అంతకుముందు అక్షింతలకు ఖిల్లా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ గడ్డం రాధకృష్ణారెడ్డి, ఎంపీటీసీ మానససాయి, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, శాంతయ్య, లక్ష్మణ్, సుదర్శన్, ఏజీదాస్, వీడీసీ సభ్యులు తోట చిన్నసాయిలు, వారాల సాయిలు, అశోక్, హరికిషన్, మహేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో అయోధ్య రామయ్య అక్షింతలను హిందూసంఘాల ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. వీడీసీ చైర్మన్ రాజేశ్వర్, మహిపాల్ యాదవ్, గంగాదాస్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం, శంభుని గుడి సహా పలు శివాలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అభిషేకాలను నిర్వహించి, మొక్కులను తీర్చుకున్నారు.నీలకంఠేశ్వర్, శంభునిగుడి ఆలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నియామకం

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజేందర్ నియమితులయ్యారు. నగరంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మలత రాజీనామా చేయడంతో రాజేందర్‌ను నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రాజేందర్ మాట్లాడుతూ.. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	24	గాజరుగడ్డ	45	60
బెండకాయ	60	90	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	60	90	దోసకాయ	25	50
దొండకాయ	45	60	ఆలుగడ్డ	18	30
బీర్నీసుకాయ	30	70	గోబిగడ్డ	25	50
కాకరకాయ	60	80	గోబిపువ్వు	40	60
వంకాయ	60	90	బీట్‌రూట్	30	60
పాలకూర	25	50	కరివేపాకు	60	80
మెంతికూర	30	50	చామగడ్డ	50	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	50	80	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు


చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	210	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	63,700	వెండి (కిలో)	75,900
22 క్యారెట్స్	58,738		

– నిజామాబాద్ బిజినెస్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	డెవిల్(తెలుగు) 10.45, 4.35 హాయ్ నాన్న(తెలుగు) 1.35 సలార్(తెలుగు) 7.20, 10.40
స్క్రీన్-3	సలార్(తెలుగు) 1.25, 4.35 డెవిల్(తెలుగు) 7.45, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సలార్(తెలుగు)11.00,2.35,6.10, 9.45
స్క్రీన్-2	సలార్(హిందీ) 11.05, 6.40, 10.15 యానిమల్(హిందీ) 2.40
స్క్రీన్-3	డంకీ(హిందీ) 12.40, 7.15 హాయ్ నాన్న(తెలుగు) 4.00, 10.35
స్క్రీన్-4	డెవిల్(తెలుగు) 12.50, 10.10
దేవి	డెవిల్(తెలుగు)
నటరాజ్	సలార్(హిందీ)
లలితామహల్	హాయ్ నాన్న(తెలుగు)
విజయ్	సలార్(తెలుగు)

సంక్షిప్తం

దుప్పట్ల పంపిణీ




డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని మానవతసదన్ చిన్నారులకు సోమవారం తెలంగాణ ప్రాంతీయ పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడు దాసరి నర్సింలు దుప్పట్లు (బ్లాంకెట్లు) పంపిణీ చేశారు. సంఘ నాయకులు భోగ అశోక్, మైసరి నారాయణ, డాక్టర్ కట్టా అశోక్, నల్ల హరికిషన్, చిలుకమారి సంతోష్, మానవత సదన్ కేర్ టేకర్ రమేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



సుభాష్‌నగర్: నగరంలో సోమవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్– రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆవిష్కరించారు. కాగా పుట్టిన తేదీ రికార్డుల్లో లేని ఫ్యామిలీ పెన్షనర్లు అదనపు పెన్షన్‌ను పొందేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని సంఘ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మకరంద్, అధికారులు రసూల్ బీ, జయప్రద, సంఘ నాయకులు రామ్మోహన్‌రావు, మదన్మోహన్, నారాయణ, ప్రసాద్ రావు, భోజారావు, వీరయ్య, గంగాధర్, రాధాకిషన్, లింగయ్య పాల్గొన్నారు.

బీటీఏ ఆధ్వర్యంలో..



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని డీఈవో కార్యాలయంలో సోమవారం బీటీఏ(బహుజన టీచర్స్ అసోసియేషన్) నూతన క్యాలెండర్‌ను డీఈవో దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు సాయిలు, స్వామినాయక్, సంతోష్‌నాయక్, సాగర్, సయ్యద్ యూసుఫ్, ప్రభాకర్, శంకర్, ప్రకాష్‌పవర్, కేశ్యానాయక్, యాకుబ్ అలీ, అంబర్‌సింగ్ ఉన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో..



ధర్పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో లక్ష్మణ్ పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు వెంకట్ రాజారెడ్డి, సతీష్ కుమార్, ప్రసన్న కుమార్, సత్యనారాయణ, వినోద్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, స్నేహలత, సుజాత పాల్గొన్నారు.

సిరికొండ: మండల విద్యా వనరుల కేంద్రంలో పీఆర్టీయూ క్యాలెండర్లను ఎంఈవో శ్రీనివాస్ ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు నరహరి, మోజీరాం, శ్రీనివాస్, గంగాధర్, వెంకట్రాం, రాధాకృష్ణ, శంకర్, భీమ్‌రాజ్, రాంచందర్, జవహర్, నవీన్, సంతోష్ పాల్గొన్నారు.

విరాళాల డీడీ అందజేత



సిరికొండ: సైనికుల సంక్షేమార్థం సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ఇటీవల సుమారు రూ.50వేల విరాళాలు సేకరించారు. అనంతరం విరాళాలను డీడీ రూపంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు సోమవారం వారు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులను అభినందించారు. అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, డీఈవో దుర్గాప్రసాద్, ఆర్డీవో రాజేంద్రకుమార్, ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి రమేష్, ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు గంగామోహన్, సతీష్, పాల్గొన్నారు.

భూమిపూజ

సిరికొండ: మండలంలోని లొంకలో సోమవారం భక్తుల సౌకర్యార్థం సిరికొండకు చెందిన బిల్డర్ దువ్వూరి సంజీవ్ రెడ్డి తన తండ్రి, దివంగత మాజీ సర్పంచ్ నర్సారెడ్డి స్మారకార్థం పది మలమూత్ర విసర్జనశాలలు నిర్మించడానికి ముందుకు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నిర్మాణానికి సోమవారం పురోహితులు దండాల నాగరాజుశర్మ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు.

ప్రజావాణిలో ఫిర్యాదు



నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని ఆయా శాఖల్లో అధికారులు బినామి పేర్లతో హైర్ వాహనాలు వాడుతూ, హైర్ వాహనాల డ్రైవర్ల పొట్ట కొడుతున్నారని సోమవారం ప్రజావాణిలో తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విన్నవించారు. వివిధ శాఖల అధికారులు మా వాహనాలు తొలగించి, వైట్ ప్లేట్స్‌కు సంబంధించి వాహనాలు పెట్టుకొని బిల్లులు తీసుకుంటున్నారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని విన్నవించారు. సంఘ ప్రతినిధులు మహేందర్, సమీర్, శ్యామ్‌కుమార్, అన్వేష్, మోహన్, రవి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కోటగల్లి ప్రభుత్వ పాఠశాలను సోమవారం డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.